# అమ్మాజీ

భార్యాభర్తలిరువురూ ఉద్యోగస్తులైతే ఆఫీసు వేళల్లో వారి పిల్లల ఆలనా పాలనా సంరక్షణ కొరకు కొన్ని పట్టణాలలో 'బాలమందిరాలు' ఉన్నాయి. దంపతులు ఉదయం ఆఫీసుకు వెళ్లేటప్పుడు తమ చిన్నారులను బాలమందిరంలో అప్పగించి సాయంత్రం తిరిగి వచ్చి పిల్లలను తమతో ఇంటికి తీసుకుని వెళ్లచ్చు. బాల మందిరంలో పిల్లలకు ఏ లోటూ రాకుండా ఎంతో శ్రద్ధ వహించి వారికి టైమ్ ప్రకారం అన్ని సదుపాయాలూ సమకూరుస్తారు. అందుకు తగిన ఫీజు వసూలు చేస్తారు.

అయితే ఈ రోజుల్లో మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు సులభంగా లభిస్తున్నాయి. కానీ, బాలమందిరాల్లోనూ, కాన్వెంటుల్లోనూ ఎడ్మిషన్స్ అంత తేలికగా దొరకటంలేదు. అందుకు కారణం బాలమందిరాల్లో వారికి గల వనరుల పరిమితినిబట్టి 15-20 మంది పిల్లల కంటే ఎక్కువమందిని వారు తీసుకోవటంలేదు. దాంతో కాంపిటీషన్ పెరిగింది. ఫీజులు పెరిగాయి.

కాత్యాయిని, ఆమె భర్త శంకర్రావు ఇద్దరూ ఉద్యోగరీత్యా ఆ ఊరు బదలీ అయి వచ్చారు. వారికి పది నెలల వయసున్న బాబు ఉన్నాడు. వారు గత మూడు రోజులుగా ఊళ్లో ఉన్న అరడజను బాలమందిరాలూ తిరిగారు. ఎందులోనూ సీటు దొరకలేదు. అయితే మిగిలిన వాటికంటే, వారు ఉంటున్న వినాయక్‌నగర్ కాలనీలో ఉన్న "అమ్మాజీ బాలమందిర్" ఎంతో మంచిదని అందరూ చెప్పారు.

అమ్మాజీ బాలమందిర్లో ఉన్న సదుపాయాలు మరెక్కడా లేవు. అది ప్రేమ్‌చంద్ బంగళాలో క్రిందిభాగంలో ఉంది. విశాలమైన ఆవరణ మధ్యలో బిల్డింగ్, పెద్ద హాల్లో రెండు గోడల దగ్గర పదేసి ఊయలలు, వాటిపక్కనే కప్‌బోర్డ్‌లు ఉన్నాయి. గది మధ్యలో మెత్తటి కార్పెట్, దానిమీద రకరకాల ఆటవస్తువులు, బొమ్మలు ఉన్నాయి. పిల్లలు నడక నేర్చుకునేందుకు నాలుగు వాకర్స్ ఉన్నాయి. హాలుకు ముందు ఆఫీస్ రూమ్, విజిటర్స్ రూమ్ వగైరా

ఉన్నాయి.

బాలమందిర్ నిర్వహిస్తున్న అమ్మాజీకి పిల్లల్ని సాకటంలో ఎంతో నేర్పూ ఓర్పూ ఉంది. అంతేకాదు పిల్లల విషయంలో ఆరోగ్య సూత్రాలు రిజిడ్‌గా పాటిస్తుంది. ఆమె వద్ద పనిచేస్తున్న ఆయాలకు మంచి ట్రైనింగ్ ఇచ్చింది. పిల్లల నేప్‌కిన్స్, పక్కబట్టలు డైలీ క్లీన్ చేయించి రోజూ వాటిని మార్పిస్తుంది. పిల్లలకి టైమ్ ప్రకారం అన్నీ జరిగేలా చూస్తుంది.

ఉదయం పిల్లలు బాలమందిర్‌కి వచ్చేటప్పుడు ఎంత ఫ్రెష్‌గా ఉంటారో, సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు కూడా అంత ఫ్రెష్‌గానూ ఉంచుతుంది.

శంకర్రావు తన గుడ్ ఆఫీసెస్ ఉపయోగించి అమ్మాజీ బాలమందిర్‌లో కొడుక్కి ఎడ్మిషన్ సంపాదించాలనుకున్నాడు. కోలీగ్స్‌ద్వారా వివరాలు సేకరించాడు.

అమ్మాజీ బాలమందిర్ ఉన్న బంగళా ఓనర్ ప్రేమ్‌చంద్ కోటీశ్వరుడు. అతని భార్య శాలిని. వారి ఏకైక కుమారుడు రతన్‌చంద్. అమెరికాలో ఉంటున్నాడు. అమెరికా వాతావరణం ప్రేమ్‌చంద్‌కి, శాలినికి నప్పలేదు. అందువల్ల వారు ఇక్కడే సెటిలయ్యారు. రతన్‌చంద్ ఏడాదికో పర్యాయం భార్యా పిల్లలతో వచ్చి తల్లిదండ్రివద్ద వారం పదిరోజులుండి వెళ్తాడు.

ప్రేమ్‌చంద్ తన బంగళాలో గ్రౌండ్‌పోర్షన్ అంతా అమ్మాజీకి బాలమదిర్‌కోసం ఫ్రీగా ఇచ్చాడు. అంతేకాక బాలమందిర్‌కి కావలసిన హంగులు, ఏర్పాట్లూ సమకూర్చాడు. 'అందువల్ల ప్రేమ్‌చంద్ రికమెండ్‌చేస్తే అమ్మాజీ వారి మాట కాదనలేక తన కొడుకుని బాలమందిర్‌లో చేర్చుకుంటుంది" అనుకున్నాడు శంకర్రావు.

సాయంత్రం భార్యను, కొడుకుని తీసుకొని ప్రేమ్‌చంద్ బంగళాకు వెళ్లాడు. గేటువద్ద ఉన్న వాచ్‌మెన్ ఫోన్లో ప్రేమ్‌చంద్‌గారితో మాట్లాడి వారిని లోనికి పంపాడు. వారు వెళ్లేసరికి ప్రేమ్‌చంద్ అతని భార్య లాన్‌లో కూర్చుని ఉన్నారు.

ప్రేమ్‌చంద్‌కి సుమారు డెబ్బై ఏళ్లు. అతని భార్యకు అరవై అయిదేళ్లు. ఇద్దరిదీ పసిమి చాయ. వారు గత ఏభై ఏళ్లుగా ఆంధ్రాలో ఉంటున్నారు. తెలుగు చక్కగా మాట్లాడతారు.

శంకర్రావు వారికి నమస్కరించి తనను పరిచయం చేసుకుని భార్యను పరిచయం చేశాడు. వారి దానశీలతను, గౌరవప్రతిష్టలను పొగిడాడు. ఉద్యోగస్తులైన భార్యాభర్తలకు బాలమందిర్ ద్వారా ఎంతో ఉపకారం చేస్తున్నారని , వారు నిర్వహిస్తున్న అమ్మాజీ బాలమందిర్‌కి ఊళ్లో మంచి పేరు వచ్చిందని కొనియాడి, అమ్మాజీగారు తమకేమవుతారని మాటలు సందర్భంలో కేజువల్‌గా అడిగాడు.

అతడి ప్రశ్నకు ఆయన చిరునవ్వు నవ్వి,

"అమ్మాజీ ఆంధ్ర. మేము గుజరాతీ. అయితే ఆవిడ మాకు మాతృదేవత! ఆవిడ బాలమందిరంలో మేము వృద్ధబాలలం. మేము ఈ వయస్సులో ఇంత ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండటానికి కారణం అమ్మాజీ సంరక్షణే! ఆ అమ్మ మాకు చేస్తున్న సేవలు ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేం !" అన్నారు.

శంకర్రావు వారి మాటలకు విస్తుపోయాడు. తమ ప్రాబ్లెమ్ ప్రేమ్ చంద్‌గారికి చెప్పి, ఎలాగైనా తమ బాబుని వారి బాలమందిర్‌లో చేర్చుకునేటట్లు చూడమని రిక్వెస్ట్ చేశాడు.

వారు కనుక సహాయం చేయకపోతే తను జాబ్‌కి రాజీనామా చేయాల్సి వస్తుందని కాత్యాయని చెప్పింది.

"మీ మదరూ, ఫాదరూ..."

"లేరండీ! నా చిన్నతనంలోనే పోయారు!" అన్నాడు దీనంగా

"అమ్మాజీ ఈ విషయంలో ఎవరి మాటా వినదు. అయినా చెప్పి చూస్తాను మీ అదృష్టం ఎలా ఉందో?" అని వారిని మర్నాడుదయం పది గంటలకు రమ్మనమని ఆ వరకు పిల్లలంతా వచ్చేస్తారు కనుక అమ్మాజీతో వారు సావకాశంగా మాట్లాడవచ్చని చెప్పి పంపారు.

అమ్మాజీ అసలు పేరు తిరుపతమ్మ. వయస్సు యాభై సంవత్సరాలు. "అమ్మాజీ!" అని ఎంతో గౌరవంతో, అభిమానంతో ఆమెను ప్రేమ్‌చంద్, శాలిని పిలవడంతో ఆమెకు ఆ పేరే స్థిరపడి వ్యావహారిక నామం అయింది.

తిరుపతమ్మకు వివాహమైన పది సంవత్సరాలకే వైధవ్యం వచ్చింది. ఆవిడ తన రెక్కల కష్టం మీద కొడుకుని చదివించి గవర్నమెంట్ ఉద్యోగం వేయించింది. తిరుపతమ్మకు గల ఉపకారబుద్ధి వల్ల ఊర్లో మంచి పలుకుబడి, గౌరవం ఉంది. ఎవరికి ఎప్పుడు ఏ సహాయం అవసరమైనా ఆమె వెనుకాడక చేస్తుంది. ఆమె ఉపకారం, సలహా పొందినవారు ఆమెకు ఏదో రూపంలో కానుకలు సమర్పించుకుని తమ కృతజ్ఞతలు వెల్లడించుకుంటారు.

కొడుకు ఆమెకు చెప్పకుండా ఆఫీసులో పనిచేస్తున్న అమ్మాయిని రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నాడు. తిరుపతమ్మ మనసు గాయపడింది. అయితే ఆమె వారిని ఏమీ అనలేదు. విషయం విన్న తిరుపతమ్మ శ్రేయోభిలాషులు ఎన్నో కానుకలు తెచ్చి నూతన దంపతులను ఆశీర్వదించారు.

వేళాపాళా లేకుండా ఎవరెవరో వచ్చి అత్తగారిని సలహాలు అడగటం తిరుపతమ్మ కోడలికి ఏమాత్రం నచ్చలేదు. ఆవిడకు గల గౌరవం, పలుకుబడి చూసి ఓర్వలేకపోయింది.

తమ సరదాలకు, సంతోషాలకు, ముచ్చట్లకూ అత్తగారు ఆటంకంగా తలచింది. ఆమెపైన లేనిపోని నిందలు మోపి బయటకు తరిమివేసింది. దిక్కుతోచక తిరుపతమ్మ ఆమె పినతండ్రి కొడుకు పరంధామయ్య ఇంటికి వెళ్లింది.

పరంధామయ్య లోగడ ప్రేమ్‌చంద్ వద్ద పనిచేసేవాడు. మంచి నమ్మకస్తుడు. ఇప్పటికీ ఆయన సొంత పనులు బాంక్ పనులు చూస్తున్నాడు. ఆయనకు సలహాదారు, పరంధామయ్య ప్రేమ్‌చంద్‌గారికి తిరుపతమ్మ దీనగాథ వివరించాడు.

ప్రేమ్‌చంద్ దంపతులకు పిల్లలంటే ఎనలేని ప్రేమ. వారికి తమ బంగళాలో బాలమందిర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచన ఉంది. అందుకు తిరుపతమ్మ సమర్థురాలని నిర్ణయించుకుని 'అమ్మాజీ బాలమందిర్' తెరిపించారు. వారు రోజూ రెండు మూడు గంటలు పిల్లల ఆటపాటలతో గడుపుతున్నారు.

మర్నాడుదయం పది గంటలకు భార్యను, కొడుకుని తీసుకుని అమ్మాజీ బాలమందిర్‌కి వెళ్లాడు శంకర్రావు. వారు వెళ్లేసరికి పిల్లలంతా కేరింతలు కొడుతూ కార్పెట్ మీదున్న బొమ్మలతో ఆడుకుంటున్నారు. వారిచెంత ఇద్దరు ఆయాలు కూర్చుని ఉన్నారు. గ్రిల్ తలుపులోంచి ఆ దృశ్యం చూసిన కాత్యాయని కొడుకు కేరింతలు కొడుతున్నాడు. వారిని చూసి ప్రేమ్‌చంద్ మేడదిగి వచ్చి వారిని ఆఫీసు రూమ్‌లో కూర్చోమని అమ్మాజీని తీసుకురావడానికి లోపలకు వెళ్లాడు.

"బాబాజీ! మనకున్న ఎక్విప్‌మెంట్స్ ఇరవై మంది పిల్లలకే పరిమితం అని మీకు తెలుసుకదా! అంతకంటే ఎక్కువమందిని ఎలా తీసుకోగలను? వీల్లేదని మీరే చెప్పొచ్చు కదా! బలవంతం చేసినా మనం చెయ్యగలిగింది ఏమీ లేదు!" అంటూ ప్రేమ్‌చంద్ గారితో వస్తున్న అమ్మాజీని చూసి

"అమ్మా ... నువ్వా?" అని శంకర్రావు

"అత్తయ్యా...మీరా!" అని కాత్యాయని ఒకేమాటు అన్నారు నిర్ఘాంతపోయి.

**(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-12-1999)** ✪